

వచ్చారు.. సర్వే చేయకుండా వెళ్లారు..!

● సింగూరు ముంపునకు గురైన భూముల్లో సర్వేకు బ్రేక్ 8

ధాన్యం డబ్బు సకాలంలో చెల్లించాలి

● తహసీల్దార్లు తరచూ మిల్లులను తనిఖీ చేయాలి
● లారీలు వెయిటింగ్‌లో ఉండకూడదు
● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



తేమ శాతం పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వడ్లు అమ్ముకున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, డబ్బులు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేయడంలో మిల్లర్లు వేగం పెంచాలని సూచించారు. కొల్చారం మండలంలోని సత్యసాయి రైస్ మిల్లు, వరిగుంతం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కాయకష్టం చేసి పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి, మద్దతు ధర పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపిస్తున్నామని, మిల్లర్లు సహకరించి త్వరితగతిన ధాన్యాన్ని దిగుమతి చేసుకొని లారీలను తిరిగి పంపాలని సూచించారు. ఏ లారీ కూడా 24 గంటలకు మించి వెయిటింగ్‌లో ఉండకూడదని, అందుకు తగ్గట్టుగా రైస్ మిల్లర్లు హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇపటివరకు 82,481 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, 21,277 మంది రైతులకు గాను రూ.54.52 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశామని కలెక్టర్ వెల్లడించారు. రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చాక నిబంధనల ప్రకారం తేమ, తాలు చూసుకొని వెంటనే తూకం చేయాలని సూచించారు. అంతేకాకుండా రైతులు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని వివరాలు సేకరించి, వాటి ఆధారంగా ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, త్వరగా డబ్బులు అకౌంట్‌లో పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు తరచూ రైస్ మిల్లులను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో గజగజ

వసతి గృహాలు, కస్తూర్బాల్లో వణుకుతున్న విద్యార్థులు



వెల్దుర్తి బాలుర హాస్టల్‌లో ఉదయం వేళ చలిలోనే చన్నీళ్ల స్నానాలు చేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట మండలం దొంతి ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. చలిలోనూ చన్నీళ్లతో స్నానాలు చేస్తున్నారు. విద్యార్థులతోనే వంట పనులు, వంటపాత్రలు శుభ్రం చేయిస్తున్నారు.

చేర్యాల పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, గురుకులంలో దుప్పట్లు, స్వెట్టర్లు, మంకీ క్యాపులు పంపిణీ చేయలేదు. విద్యార్థులు గజగజ వణుకుతూ నిద్రిస్తున్నారు. వాటర్ హీటర్లు లేకపోవడంతో చన్నీళ్లతోనే స్నానాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

మనూరు మండలం పులుకుర్తి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు దుప్పట్లు, స్వెటర్లు ఇవ్వలేదు. గజగజమంటూనే రాత్రివేళ నిద్రకు ఉపక్రమిస్తున్నారు. సోలార్ వాటర్ హీటర్ ఉన్నప్పటికీ పనిచేయడం లేదు.

కౌడిపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిటికీ తలుపులకు అద్దాలు లేక పరదాలు కట్టారు. తలుపులకు గడియలు లేక ఇనుప చువ్వలు అడ్డుగా పెట్టి విద్యార్థులు రక్షణ పొందుతున్నారు. ఇక చన్నీళ్ల స్నానంతోనే వణుకుతూ తరగతులకు హాజరవుతున్నారు.



నర్సాపూర్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో కిటికీకి అడ్డుగా దుప్పట్లు

చలికాలం వచ్చినా ఇంకా పంచని దుప్పట్లు
చన్నీళ్ల స్నానాలతో ఇబ్బందులు.. పనిచేయని హీటర్లు
వేడినీళ్లు లేక తప్పని అగచాట్లు
అధికారులు, వార్డెన్ల నిర్లక్ష్యం
కలెక్టర్లు కనికరిస్తేనే సమస్యల పరిష్కారం

సంగారెడ్డి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాలపై పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థులకు రంచన్‌గా అందాల్సిన దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొన్నిచోట్ల సక్రమంగా పంపిణీ చేయగా.. మరికొన్నిచోట్ల వాటి ప్రస్తావనే లేదు. మరి సర్కారు నుంచి వచ్చిన దుప్పట్లు, స్వెటర్లు, బ్లాంకెట్లు ఎటు మాయమయ్యాయో తెలడం లేదు. దీనికి తోడు ఎముకలు కొరికే చలిలో విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తూ గజగజ వణుకుతున్నారు.

ఒక్కోచోట ఒక్కోతీరుగా..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో భిన్నపరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని హాస్టళ్లలో దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. వాటర్ హీటర్లు లేదంటే కట్టెల పొయ్యి మీద నీటిని వేడి

మిగతా 7వ పేజీలో



సంగారెడ్డిలోని బీసీ(బి) కళాశాల వసతిగృహంలో ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకున్న విద్యార్థులు

ఏడుగురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు

ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఈ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధంగా బోధనాస్పత్రిలో పనిచేస్తూ అనధికారికంగా గైర్హాజరైన ఏడుగురు డాక్టర్లకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డా.నరేంద్రకుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో గ్రాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ ఒకరు, గైనకాలజీ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పిడియాట్రిక్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు, న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు, అనస్తేషియా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇద్దరు ఉన్నారు. వీరు సుమారు ఏడాది కాలంగా ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారు. అయితే 15 రోజుల్లో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని లేకపోతే సర్వీసు నుంచి తొలగిస్తామని డీఎంఈ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



గడిపెద్దాపూర్ పెద్దచెరువులో భారీ మొసలి!

● అప్రమత్తంగా ఉండాలని స్థానికుల విజ్ఞప్తి 7

స్కూల్ బస్సులో మంటలు

● విద్యార్థులను దించి వచ్చిన తర్వాత ఘటన



స్కూల్ బస్సులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, స్కూల్‌బస్సులో మంటలు

చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను గమ్యస్థానికి చేర్చిన తర్వాత పార్క్ చేసిన స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, కాలిపోయన ఘటన మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు.. రామాయంపేటలోని అక్షర టెక్నో స్కూల్ బస్సు రోజు మాదిరిగానే బుధవారం విద్యార్థులను వారి ఇళ్ల వద్ద దింపేసింది. తర్వాత బస్సు నార్సింగి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పార్క్ చేశారు. రాత్రి వేళ బస్సు బ్యాటరీ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందచేశారు. వారు వచ్చి మంటలు ఆర్పారు. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకే ఐక్యతా మార్చ్

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకే ఐక్యతా మార్చ్ నిర్వహిస్తున్నామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక అని ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 536 సంస్థానాలతో చిన్న చిన్న ముక్కలుగా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ఉండి ప్రత్యేక రాజ్యాలుగా ఉండేవని ఆ సంస్థానాలన్నింటిని భారతదేశంలో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కే దక్కుతుందన్నారు. దేశ సమైక్యత వెనుక పటేల్ లాంటి మహనీయుల త్యాగాలు ఉన్నాయని, వారి స్ఫూర్తిని యువత ఆచరణలో పెట్టి, దేశ సేవలో ముందుండాలని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యతకు, సామాజిక, సమగ్రతకు చేసిన కృషి అమోఘమని, ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ప్రభుత్వ అధికారులు పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని తమ కర్తవ్యాల్లో ప్రతిబింబించాలని పేర్కొన్నారు. అధికారులు ప్రజల్లో దేశభక్తి ఐక్యతా భావాన్ని నింపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, మైభారత్, మోయాస్ గోల్, జిల్లా యువజన అధికారి ఖాసీం బేగ్, ట్రైనీ కలెక్టర్‌లు దీపిక, ప్రతిభ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతా మార్చ్‌లో ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ ప్రావీణ్య అధికారులు

పాదచారికి దారేది?

● సంగారెడ్డిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
● వ్యాపార సంస్థల వస్తువులు, వాహనాలు వీటిపైనే
● సెల్లార్లలో దుకాణాల ఏర్పాటు.. రోడ్లపైనే పార్కింగ్
● చూసీచూడనట్లుగా పోలీస్, మున్సిపల్ యంత్రాంగం



సంగారెడ్డిలో ఆక్రమించిన ఫుట్‌పాత్‌లు

సంగారెడ్డి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. ఉద్యోగాలు, విద్య నిమిత్తం ప్రజలు జిల్లా కేంద్రానికి మకాం మారుస్తుండటంతో రద్దీ అధికమవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్లపై వాహనాల రాకపోకలు తీవ్రంగా ఉంటున్నాయి. అయితే, మున్సిపాలిటీ పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమించి వస్తువులను నిలుపుకుంటున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉండటంతో.. పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు రోడ్లపై నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేకపోవడంతో రోడ్డు పక్కన నడుస్తున్న పాదచారులు గతంలో ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి.





రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు

ఫుట్‌పాత్‌లపై అక్రమ డబ్బాలు, షెడ్లు

పట్టణంలోని ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డు, శాంతినగర్, ఎంపీడీవో కార్యాలయం వంటి ప్రధాన ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై కొందరు అక్రమంగా డబ్బాలు (అర్థాంతర షెడ్లు) ఏర్పాటు చేశారు. కొందరు ప్రజాప్రతినిధులు తమకున్న పలుకుబడితో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండానే ఈ డబ్బాలు ఏర్పాటు చేయించి, వాటిని వివిధ వ్యాపారాల కోసం ఇతరులకు అద్దెకిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లపై ఇవి ఏర్పాటు చేయడంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సెల్లార్లలో దుకాణాలు.. రోడ్లపై పార్కింగ్

నిబంధనల ప్రకారం, వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్ కోసం తప్పనిసరిగా స్థలాన్ని కేటాయించాలి. 200 చదరపు మీటర్ల పరిధిలో భవన నిర్మాణం చేపడితే ముందు భాగంలో, 750 చదరపు మీటర్ల పరిధి కన్నా ఎక్కువ స్థలంలో బహుళ వాణిజ్య అంతస్తు నిర్మిస్తే కచ్చితంగా వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్ ఏర్పాటు చేయాలి. సంగారెడ్డిలో సెల్లార్లు ఏర్పాటు చేసిన కొన్ని దుకాణాల యాజమాన్యాలు... నిబంధనలకు విరుద్ధంగా వాటిలో దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నాయి. దీంతో, వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు.

సంగారెడ్డి పట్టణంలో వ్యాపార సంస్థలు ఫుట్‌పాత్‌లను తమ ఆస్తిగా భావించి ఆక్రమిస్తున్నప్పటికీ, పోలీసు, మున్సిపల్ అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారి నుంచి ముడుపులు తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, సంగారెడ్డి పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించి, అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకొని, పాదచారుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లీ కాపలా?

అల్లాదుర్గంలోని ఐకేపీ కార్యాలయంలో యూనిఫాం చీరల నిల్వ
రెండు నెలలుగా ఎదురుచూపులు
ఎలుకల బెడద నుంచి కాపాడలేక ఇబ్బందులు 7



ఐకేపీ కార్యాలయంలో టార్పాలిన్ కప్పి ఉంచిన చీరలు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు
వెంకటాపూర్ పరిధిలోని హైవే 65పై ఘటన 7

ఇంట్లోకి చొరబడి.. కళ్లలో కారం కొట్టి ..

● వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు అపహరణ



వృద్ధురాలు మణెమ్మ, గొలుసు కాజేసినప్పుడు అయిన గాయాన్ని చూపుతున్న వృద్ధురాలు

జోగిపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి కళ్లలో కారం కొట్టి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును గుర్తుతెలియని దుండగుడు అపహరించాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. జోగిపేటకు చెందిన శంకరంపేట మణెమ్మ ఇదే పట్టణంలోని సత్యసాయి కాలనీలో నివాసముండే తన కూతురు వెంకటలక్ష్మి వద్ద మూడు నెలలుగా ఉంటుంది. బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించిన దుండగుడు సరాసరి ఇంట్లోకి చొరబడి ఆమె కళ్లలో కారం చల్లి.. మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని వెళ్లాడు. మాణెమ్మ గట్టిగా అరవడంతో అక్కడే ఉన్న తన కూతురు వెంకటలక్ష్మి అప్రమత్తమై దొంగను పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ, దుండగుడు వెంకటలక్ష్మిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అనిల్‌కుమార్, ఎస్సై పాండు విచారణ చేపట్టారు.

రూ.20 లక్షల విలువైన పాన్ మసాల దోపిడీ

● లారీ డ్రైవర్లను బంధించిన దుండగులు

న్యాల్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ సమీపంలోని బీదర్ రోడ్డుపై దుండగులు లారీలోని రూ. 20 లక్షల విలువైన గుట్కా, పాన్‌మసాలాను దోచుకెళ్లారు. సోమవారం రాత్రి ఈ ఘటన జరగగా, లారీ యజమాని ఫిర్యాదుతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రూ. 20 లక్షల విలువైన గుట్కా, పాన్ మసాలా లోడ్‌తో లారీ కర్ణాటకలోని బీదర్ నుంచి గుజరాత్‌కు వెళ్తోంది. కొందరు దుండగులు లారీని అడ్డగించి, అందులోని ముగ్గురు డ్రైవర్లను బంధించారు. లారీలో ఉన్న గుట్కా, పాన్ మసాలాలను వేరే లారీలోకి ఎక్కించుకుని పారిపోయారు. ఈ మేరకు లారీ యజమానికి ఫిర్యాదు చేయడంతో హత్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల




సుదర్శన్ 35ఎంఎం- ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,2.15,9.15	అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ 11.15,2.30	లక్ష్మి 70ఎంఎం - కర్మన్‌ఘాట్ 6.15,9.15

GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల

ADVANCE BOOKING OPENS



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
8.00,11.00,2.00,6.00,9.00

సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00am

భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 7.45,11.30,2.45,6.30,9.45	శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30	పాయిరంగ - మియాపూర్ 8.00am
మల్లికార్జున - కూకట్‌పల్లి 7.30am	సుష్మ - వనస్థలిపురం 8.00am	శ్రీలక్ష్మి కమం. - అల్వాల్ 11.30,2.30
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 8.00,11.15,6.15	ఈశ్వర్ - అత్తాపూర్ 8.00am	విమల్ - బాలానగర్ 8.00am
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 8.00am	శ్రీదేవి - చింతలకుంట 8.00am	BR హైటెక్ - మాదాపూర్ 8.00am
	జ్యోతి - ఆర్.సి.పురం 8.00am	శ్రీవెంకటేశ్వర 70 - పటాన్‌చెరు 11.30,2.30,6.30,9.30

GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



పివిఆర్ - ఎర్రమంజిల్ 11.20am | మినీ సినిమాస్ - బాలానగర్ 12.00pm

GANESH BHARI 9296509333

రేపే బ్రహ్మాండమైన విడుదల



ఏషియన్ సినీప్లెక్స్ - ఉప్పల్ 4.30pm	విక్టరీ సత్య - కూకట్‌గూడ 4.00pm
పి.వి.ఆర్ సినిమాస్ - పంజాగుట్ట 11.00am	
సినీపోలిస్ - చందానగర్ 11.00am	
ప్రసాద్ మాల్ - పంజాగుట్ట 4.45pm	ఎ.ఎం.బి - కొండాపూర్ 5.00pm
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.35am	
ఐనాక్స్ - హైటెక్‌సిటీ 2.30pm	
పివిఆర్ - ముసారాంబాగ్ 11.00am	మినీ సినిమాస్ - బాలానగర్ 5.00pm
ప్రిజం మాల్ - గచ్చిబౌలి 2.15pm	మినీ సినిమాస్ - చందానగర్ 5.00pm
అర్బియమ్ - గచ్చిబౌలి 5.10pm	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 5.00pm
జిఎస్‌ఎమ్ - మదీనగూడ 7.30pm	ఆనంద్ మాల్ - నార్సింగ్ 5.00pm

రేపే బ్రహ్మాండమైన విడుదల



అర్బియమ్ - గచ్చిబౌలి 11.00am | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 11.40am

GANESH BHARI 9296509333

రేపే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

రేపే బ్రహ్మాండమైన విడుదల



వెంకటసాయి 70 ఎంఎం ఎ/సి - కీసర

SKML MOTION PICTURES

రేపే బ్రహ్మాండమైన విడుదల



మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.30,2.30,6.30,9.30

TRIPURA CREATIONS

రేపే బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 12.30pm
INOX జిఎస్‌ఎమ్ - మదీనగూడ 11.30am

వెంకటసాయి 70 ఎంఎం ఎ/సి - కీసర

MG MOVIES 9989522999

రేపే బ్రహ్మాండమైన విడుదల



BHAVAPRITA PRODUCTIONS 9030161717

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35ఎంఎం-ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

Ganga Entertainments 9966963111

రేపే బ్రహ్మాండమైన విడుదల



మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట

లక్ష్మి కమం ఎ/సి - అల్వాల్ | వెంకటసాయి - కీసర



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

GLOBAL CINEMAS RELEASE

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



కారులో రామానుజ మృతదేహం

సదాశివపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కారులో సొంత ఊరికి బయలుదేరిన భార్యాభర్తలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామ పరిధిలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగింది. సదాశివపేట సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ నరసయ్య ఆగ్రహారం గర్వ వీధికి చెందిన పరాంకుశం రామానుజ (53) మహారాష్ట్రలో ఎన్ఆర్‌సీ ఇన్ఫ్రా డెవలపర్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి రామానుజ తన భార్య అనురాధతో కలిసి తన కారులో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సదాశివపేట మండలం వెంకటాపూర్ వద్దకు రాగానే కారుకు ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి మరో గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో రామానుజ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య అనురాధ తీవ్ర గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన అనురాధను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెంకటేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు...



కిషన్ (ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం... శెట్టిపల్లి గ్రామానికి చెందిన పైసా కిషన్(63) బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పొలం వద్ద ఉన్న బోరు మోటారుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు హరీష్ ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనియార్‌పల్లిలో యువకుడు...

కోహీర్, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మనియార్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోహీర్ పట్టణంలోని జహంగీర్‌వాడ కాలానికి చెందిన సల్మాన్(20) ఎలక్ట్రీషియన్. మంగళవారం మండలంలోని మనియార్‌పల్లి గ్రామ పరిధిలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో వైరింగ్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గతంలో సల్మాన్ సోదరులు కూడా అనారోగ్యంతో మృతి చెందారు. రెండేళ్ల కాలంలోనే ముగ్గురు కొడుకులు మృతి చెందడంతో సల్మాన్ తల్లి, అతడి సోదరి అనాథలయ్యారు. వారు బోరును విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది.

విలేకరిపై కేసు నమోదు

కోహెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విలేకరిగా చలామణి అవుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఒకరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. కోహెడ మండలం ధర్మసాగర్ పల్లి గ్రామానికి చెందిన పొన్నాల సంజీవ్ అనే వ్యక్తి ప్రెస్ రిపోర్టర్ అంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. సిద్దిపేటకు చెందిన గూడాల దుర్గా రాంబాబు నాలుగు వారాలుగా కోహెడలోని చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తూ వడ్డీ వ్యాపారం చేస్తున్నాడని చెప్పారు. నాలుగు వారాల నుంచి ఓ పీడీఎఫ్ పత్రిక విలేకరిగా పనిచేస్తున్న పొన్నాల సంజీవ్ ఫోన్ చేసి తాను రిపోర్టర్‌ని అని బెదిరిస్తూ నాకు డబ్బులు ఇవ్వాలి లేదంటే నీ గురించి పేపర్‌లో రాస్తా అని అతడికి వాట్సాప్, ఫోన్ ద్వారా బెదిరించినట్లు తెలిపారు. దుర్గా రాంబాబు ఫిర్యాదు మేరకు పొన్నాల సంజీవ్‌పై చట్టప్రకారం కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. ఇలాగే ఎవరైనా బెదిరించినచో వారి పైన చట్ట ప్రకారం చర్య తీసుకుంటామనిని ఎస్సై తెలిపారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మిల్లీ అసోసియేషన్ సభ్యులు

మెదక్ కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మెదక్ మిల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ మొదటి విద్యాశాఖ మంత్రి, భారత్ రత్న, స్వాతంత్ర సమరయోధుడు జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని మంగళవారం రాత్రి మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ టి. చంద్రపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిల్లి మెదక్ మిల్లీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఒమర్ ఖాన్, మెదక్ మిల్లీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుజాత అలీసుఫీ, జర్నలిస్ట్ రియజుద్దీన్, యూసుఫ్, ఫాజిల్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ కాపలా?

● యూనిఫాం చీరల పంపిణీలో జాప్యం
● రెండు నెలలుగా ఎదురుచూపులు
● ఎలుకల బెడద నుంచి కాపాడలేక ఇబ్బందులు



అల్లాదుర్గంలోని ఐకేపీ కార్యాలయంలో నిల్వ ఉంచిన చీరలు

అల్లాదుర్గం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల (ఎస్.హెచ్.జి) మహిళలకు యూనిఫాం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెండు నెలల క్రితం చీరలను మంజూరు చేసింది. అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్, పెద్ద శంకరంపేట తదితర మండలాలకు చెందిన చీరలను సెప్టెంబరులో తెప్పించి అల్లాదుర్గంలోని ఐకేపీ కార్యాలయంలో నిల్వ ఉంచారు. ఈ భవనంలో ఎలుకల బెడద తీవ్రంగా ఉండటంతో, దుస్తులను భద్రంగా ఉంచాలనే ఉద్దేశంతో వాటి చుట్టూ గమ్‌ప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎక్కడ పాడుచేస్తాయోనని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అసలే ఇరుకు గది, ఆపై ఈ దుస్తుల నిల్వతో సమావేశాలు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి, నిల్వ ఉన్న ఈ చీరలను వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గడిపెద్దాపూర్ పెద్ద చెరువులో భారీ మొసలి!



పెద్ద చెరువులో సంచరిస్తున్న మొసలి (వృత్తంలో)

అల్లాదుర్గం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో పెద్ద మొసలి కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. బుధవారం ఉదయం కొందరు రైతులు వ్యవసాయ పనుల కోసం అటుగా వెళ్లగా, వారికి భారీ మొసలి కనిపించినట్లు వారు తెలిపారు. ఈ చెరువులోకి మొసలి ఎలా వచ్చిందని వారు విస్మయం వ్యక్తం చేశారు. చెరువులో సంచరిస్తున్న ఈ మొసలిని కొందరు సెల్ ఫోన్‌లో చిత్రీకరించి విడుదల చేయడంతో, స్థానికుల్లో ఎక్కడ చూసినా ఈ మొసలి వార్తే చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థులందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మల్లన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం



మంత్రాలు పఠిస్తున్న అర్చకులు

కొమురవెల్లి, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం పవిత్ర కార్తీకమాస దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక బహుళ అష్టమిని పురస్కరించుకుని 23వ రోజు దీపోత్సవంలో భాగంగా ఆలయ మహా మండపంలో నవగ్రహ స్తోత్ర పఠనం, కాలభైరవ అష్టక పఠనం గావించారు. అనంతరం హరిద్రా లింగ ఆకృతిలో దీపాలంకరణ చేసి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు దీపోత్సవంలో పాల్గొని తరించారు. మహిళలకు ఆలయాధికారులు, అర్చకులు దీపపు ప్రమిదలు, పూజా సామగ్రిని, ప్రసాదాలను అందించారు. ఆలయాధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

దుబ్బాక, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పేద విద్యార్థినులకు బుధవారం సైకిళ్లను పంపిణీ చేశారు. దాతలు అందించిన 44 సైకిళ్లను సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు నీలం శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17, టీ బ్రివాలా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థల సహకారంతో బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో సైకిళ్లు అందించిన సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య గౌడ్, సంస్థల ప్రతినిధులు శివానీ టీ బ్రివాలా, షీషం సబర్వాల్, భావనా సుమన్, దీపికా, నేహా, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్ పాల్గొన్నారు.

16న నందిని సిధారెడ్డి నవల ఆవిష్కరణ



కరపత్రాన్ని విడుదల చేస్తున్న మరసం ప్రతినిధులు

సిద్దిపేట క్రైం నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి రచయిత నందిని సిధారెడ్డి రచించిన నాగటి తరం నవల ఆవిష్కరణ సభ ఈ నెల 16న కొండపాక మండలం బందారంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంజీరా సంఘం ప్రతినిధులు కొమురవెల్లి అంజయ్య, పప్పుల రాజిరెడ్డి, ఎన్. భగవాన్ రెడ్డి బొరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పొన్నాల బాలయ్య, తోట అశోక్, సిద్దెంకి యాదగిరి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రను వేసిన నందిని సిధారెడ్డి అనుభవాలనుంచి రచించిన ఈ నవల ఆవిష్కరణ సభకు ప్రముఖ సంపాదకులు, రచయిత బైస దేవదాసు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ప్రముఖ కవి వాసిరెడ్డి నవీన్ నవలను ఆవిష్కరిస్తారని, తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షులు కవి, రచయిత నాళేశ్వరం శంకరం సమీక్షిస్తారని తెలిపారు.



కాడిపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చన్నీళ్లతోనే ముఖాలు కడుక్కుంటున్న విద్యార్థులు

హాస్టళ్లలో గజగజ

5వ పేజీ తరువాయి

చేసి స్నానాలకు అందిస్తున్నారు. కానీ కొన్ని చోట్ల దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేయలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. హాస్టళ్ల వార్డెన్లు సక్రమంగా పర్యవేక్షించిన చోట ఎలాంటి సమస్యలు లేవు. కానీ నిర్లక్ష్యంగా ఉండేవారి హాస్టళ్లలోనే సమస్యలు నెలకొన్నట్లుగా 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో తేటతెల్లమైంది. దుప్పట్లు, స్వెటర్లు రాలేదా.. వచ్చినా పంచలేదా అనే విషయంపై అస్పష్టత నెలకొంది.

ఎముకలు కొరికే చలిలో..

గత నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ప్రధానంగా సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో అత్యధిక చలి ఉంటుందని, 10డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలోనే చలిగాలులు వీస్తూ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తాజా పరిణామాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అధికార యంత్రాంగం ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను విస్మరించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాపులు అందించాల్సి ఉండగా ఆ పరిస్థితి లేకపోయింది. ఎముకలు కొరికే చలిలోనే విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారు.



మెదక్ సమీకృత వసతిగృహంలో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకొని చదువుకుంటున్న విద్యార్థులు



వట్‌పల్లి మండలం దేవునిపల్లి ఎస్సీ హాస్టల్‌లో పనిచేయని వాటర్ హీటర్

మధ్యాహ్నం, సాయంత్రాల్లో స్నానాలు..

వాటర్ హీటర్లు పనిచేయని చోట, కట్టెల పొయ్యిలపై నీళ్ల వేడిచేయని హాస్టళ్లలో విద్యార్థులు రూటు మార్చారు. ఉదయాన్నే చన్నీటి స్నానం చేస్తే జలుబు, జ్వరంతోపాటు వణుకుతూ ఇబ్బందులు పడుతున్నామని గ్రహించి కొంతమంది ఇతర వేళల్లో స్నానాలు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో ఉంటున్న విద్యార్థులు మధ్యాహ్నం సమయంలో స్నానాలు చేస్తుండగా.. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు సాయంత్రం వేళ స్నానం ఆచరిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో పలువురు విద్యార్థులు ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు.

కనికరించాల్సింది కలెక్టర్లే..

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలపై ఇప్పటికే సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించారు. భోజనం, ఇతర సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆరా తీస్తున్నారు. కాగా చలికాలంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపైనా ఒకసారి ఫోకస్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలనే విన్నపాలు ఉన్నాయి. అదే విధంగా వసతి గృహాల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లు, సంబంధిత అధికారులపై చర్యలు కూడా తీసుకోవాలని అటు విద్యార్థులు, ఇటు స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సలోమోహన్‌రెడ్డికి సన్మానం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఈదర సలోమోన్‌రెడ్డికి ఇటీవల మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసినందుకు గుడ్ ఫ్రెండ్స్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆస్పత్రిలో అన్నదానం

నర్సాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతివారం వందమంది రోగులకు క్లబ్ ద్వారా అన్నదానం చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్‌రావు తెలిపారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలి

● మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి హేమభార్గవి

నర్సాపూర్/పెద్దశంకరంపేట/చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చడంలో అందరి సహకారం అవసరమని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి హేమభార్గవి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజధానికి అతి సమీపంలో ఉన్న మెదక్ జిల్లాల్లోని గ్రామాల్లో ఇంకా బాల్య వివాహాలు చేస్తుండడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధులత, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ రఘువరన్, ఆర్ఐ ప్రభాకర్, ఇన్‌చార్జి సీడీపీవో సరళ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీటీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు పాల్గొన్నారు. పెద్దశంకంపేటలోని ఐకేపీ కార్యాలయంలో అల్లాదుర్గం సీడీపీవో పద్మలత ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో షాకీర్‌అలీ, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, మండల వైద్యాధికారి షర్ఫోద్దీన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వరూపరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, ఎంఈవో నీరజ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమభార్గవి

మీట్ మార్కెట్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

రామచంద్రాపురం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మీట్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. బుధవారం రామచంద్రాపురంలో స్థల పరిశీలన చేసి మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మురుగు సమస్యలున్నాయంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. మురుగు లీకేజీలు లేకుండా పరిష్కారం చేస్తామంటూ హామీఇచ్చారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి శ్రీరాంనగర్ కాలనీలో పర్యటించారు. గుంతలు, మురుగు, మ్యాన్‌హోల్స్, చెత్తను శుభ్రం చేయడం వంటి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌రావు, వీరారెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు

● మానవత్వం చాటిన అయ్యప్ప భక్తులు



సంగారెడ్డిలో అనాథ మహిళకు అంత్యక్రియలు జరిపిస్తున్న అయ్యప్ప ఆద్బాంధవ సేవా సమితి సభ్యులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓ అనాథ మహిళకు అంత్యక్రియలు జరిపించి మానవత్వాన్ని చాటుకున్నారు అయ్యప్ప ఆపద్బాంధవ సేవాసమితి సభ్యులు. సంగారెడ్డి పట్టణంలోని భవానీ మందిరం ప్రాంతంలో అద్దె గదిలో నివాసముండే లక్ష్మమ్మ బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న అయ్యప్ప ఆపద్బాంధవ సేవాసమితి సభ్యులు మానవతా దృక్పథంతో అంత్యక్రియలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సత్యనారాయణ, రాజు, జట్టి రవీందర్, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చారు.. సర్వే చేయకుండా వెళ్లారు..!

● సింగూరు ముంపునకు గురైన భూముల్లో సర్వేకు బ్రేక్



సర్వే చేసేందుకు వచ్చిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

మునిపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండలం మల్లారెడ్డిపేట గ్రామం సమీపంలోని సింగూరు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైన భూములు కబ్జాకు గురవుతున్నాయని, వెంటనే ఆపాలని కోరుతూ మాజీ సర్పంచ్ శివజ్యోతి, మాజీ ఉపసర్పంచ్ రాజు, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే బుధవారం సర్వే చేసేందుకు ఇరిగేషన్ డీఈఈ నాగరాజు, ఏఈ అఖిల, ఆర్ఐ సుభాష్, సర్వేయర్ సునీత, గ్రామపాలన అధికారి రాజు వచ్చారు. కానీ సర్వే చేయకుండా వెళ్లిపోయారు. ఇదేంటని గ్రామస్థులు అడిగితే భూమి ఎంతవరకు ఉంది. ఎన్ని ఎకరాలు ఉంది అనేది చూస్తాము. కానీ సింగూరు ప్రాజెక్టులో ఇంత హద్దు ఉంది అని తాము చెప్పలేమని, అది సింగూరు ప్రాజెక్ట్ అధికారులు చెబుతారని తెలిపారు. మరి మీరెందుకొచ్చారు.. చూసి పోవడానికి అంటూ అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లో సింగూర్ ప్రాజెక్ట్ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారంలందరం వచ్చి సర్వే చేస్తామని చెప్పారు. అందరి సమక్షంలో సర్వే చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

గ్రామస్థులు ఫిర్యాదు నేపథ్యంలో..

సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైన భూమిలో కాలువ తీస్తున్నారని రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా రాజకీయ నాయకుల అండతో మల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌ను వివరణ కోరగా.. ముంపు భూముల్లో కాలువ తీసినట్లు అధికారుల నివేదిక వస్తేనే సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి



నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగాన్ని పెంచాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు రోడ్డు పనులు నిదానంగా జరుగుతున్నందున నిత్యం ట్రాఫిక్ నరకంగా మారిందని చెప్పారు. అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురం, పటాన్‌చెరు పట్టణాల్లో నిర్మించనున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం విషయంలో సంయుక్తంగా పరిశీలన చేయాలని కోరారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, శాస్త్రి, రమేష్, స్వామి పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ : డీఎస్పీ



ముప్పిరెడ్డిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

మనోహరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, పోలీసు, ప్రజల మధ్య మంచి సంబంధాలు ఏర్పడేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పత్రాలు లేని 67 బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ఓబులదేవరపల్లి గ్రామానికి చెందిన రామానాయుడు అనే యువకుడు ఇంట్లో గొడవ పెట్టుకుని ముప్పిరెడ్డిపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సంగారెడ్డి క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని శిశు గృహ, సఖి కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పిల్లలకు అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉచిత న్యాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత న్యాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ జెండర్ విభాగం సలహాదారులు జమున అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఎవ్వరికి చెప్పుకోలేని సమస్యలతో నిత్యం బాధపడుతున్నారని, అలాంటివారు కేంద్రాలకు వచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెండర్ విభాగం రాష్ట్ర అధికారి జాన్,అధికారులు వెంకట్, బాగయ్య పాల్గొన్నారు.

రైతులకు రూ.500 బోనస్ చెల్లించాలి

● బీజేపీ జిల్లా నాయకుడు కోణం విఠల్

పెద్దశంకరంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన సన్నవడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించాలని బీజేపీ మెదక్ జిల్లా నాయకుడు కోణం విఠల్ పేర్కొన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సన్నవడ్లు పండిస్తే రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీఇచ్చి నేటికీ చెల్లించలేదని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షుడుప బొగుడాల కృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సప్తాహ

నారాయణఖేడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లింగాపూర్‌లో మార్కండేయ ఆలయం చతుర్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమం బుధవారం మూడోరోజు కొనసాగింది. వడగాంకు చెందిన చైతన్యమహరాజ్ కీర్తన నిర్వహించారు. 16న శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పూజారి మడపతి సంగయ్యస్వామి తెలిపారు. అలాగే ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో 14 నుంచి వారంరోజుల పాటు అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

అభివృద్ధి పనులు ఎలా జరిగాయి..?

● కొండాపూర్‌లో ట్రైనీ ఎంపీడీవోల బృందం ఆరా



తొగర్‌పల్లిలో పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎంపీడీవోల బృందం

కొండాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు ఏ విధంగా జరిగాయని ట్రైనీ ఎంపీడీవోల బృందం ఆరాతీసింది. బుధవారం మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్వహణ, ఉపాధిహామీ పనుల తీరును తెలుసుకునేందుకు తొగర్‌పల్లి గ్రామంలో ట్రైనీ ఎంపీడీవోల బృందం పర్యటించింది. అలియాబాద్‌లో పల్లె ప్రకృతి వనం, నర్సరీలో మొక్కల పెంపకం, చెత్త సేకరణతో ఎరువుల తయారీని పరిశీలించారు. తొగర్‌పల్లిలో గ్రామ పంచాయతీ రికార్డులను, పనీతీరు, పంచాయతీరాజ్ చట్టంపై ప్రజలకు ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీలో కూలీల పనిదానాలు, చెల్లింపులు, చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ పర్యటనలో ఏపీడీ పూజ, కొండాపూర్, వట్‌పల్లి ఎంపీడీవోలు సౌమ్యశ్రీ, ఏపీవో వీరప్ప, జీపీ కార్యదర్శి నర్సమ్మ, టీఏ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పద్మారెడ్డి పరామర్శ



కుటుంబసభ్యులను ఓదారుస్తున్న పద్మారెడ్డి

నిజాంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుదాఘాతంతో ఒకరు, అనారోగ్యంతో మరొకరు మృతిచెందగా.. వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి బుధవారం పరామర్శించారు. నస్కల్‌లో మృతుడు లాలగౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. అదేవిధంగా బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బోడపట్ల మల్లేశం తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వెల్దుర్తి/చిన్నశంకరంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మాలతి సందర్శించారు. ఆమె వెంట ఆర్ఐ రాజు ఉన్నారు.

వ్యర్థ జలాలు తాగి జీవాలకు అస్వస్థత



అస్వస్థతకు గురైన గొర్రెలు

శివ్వంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యర్థ జలాలు తాగి జీవాలు అనారోగ్యానికి గురైన సంఘటన నవాబ్‌పేట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండ నాగేష్, కొమ్ము సంజీవ, రాజకుమార్‌కు చెందిన మేకలను, గొర్రెలను గ్రామ సమీపంలో మేపుతున్నారు. కాగా గ్రామంలోని ఓ పరిశ్రమ నుంచి వచ్చిన వ్యర్థ జలాలను 12 మూగజీవాలు తాగి అస్వస్థతకు గురయ్యాయి. వాటికి వైద్యం చేయిస్తున్నామని బాధితులు తెలిపారు. అధికారులు పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిజాంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,451 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన కిషోర్‌గౌడ్ నివాసంలో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్నారని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మాసాయిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలోని గోశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మాసాయిపేట గోశాల సమీపంలో దాబా వద్ద రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని అతివేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

పటాన్‌చెరు రిటర్నింగ్ అధికారిగా విశాలాక్షి

పటాన్‌చెరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నిమ్జ్ ఆర్డీవో విశాలాక్షి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు పనిచేసిన దేవుజ జహీరాబాద్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అనంతరం బీఎల్‌వోలు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

పటాన్‌చెరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలతో ఆధార్‌కార్డులు పొందని వారికోసం ప్రత్యేకంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. బుధవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి విశాలాక్షికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు గతం నుంచి ఆధార్‌కార్డులు పొందలేదని వివరించారు. ఇప్పుడు కొత్తగా కార్డు పొందాలంటే అమీర్‌పేటలోని కేంద్రంలో క్యూలో నిలబడాల్సి వస్తోందని చెప్పారు. పటాన్‌చెరులో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌చారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లను ఖాళీ చేయకపోతే చర్యలు



రైస్‌మిల్లును సందర్శించిన తహసీల్దార్ శివప్రసాద్

చేగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లర్లు దొడ్డు వడ్లను ఖాళీ చేయకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ శివప్రసాద్ హెచ్చరించారు. బుధవారం దొడ్డు వడ్ల దిగుమతిపై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం రావడంతో ఆయన మండలంలోని మక్కరాజుపేటలో ఉన్న బాలాజీ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు తెచ్చిన సన్న, దొడ్డు వడ్ల తేడా లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. రైతుల ధాన్యాన్ని తిరస్కరించడం లేదా ఆలస్యం చేసిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించండి

సంగారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలని సీపీఐ నాయకులకు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సంగారెడ్డిలో ఎస్పీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి మాట్లాడారు. సీపీఐ ప్రజా సమస్యలపై చేసే పోరాటాలు అభినందించాల్సిన విషయమని అన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఏ.రహ్మాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహంబాబ్‌ఖాన్, నాయకులు ఉన్నారు.



సంగారెడ్డిలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసి పూల మొక్కను అందజేస్తున్న సీపీఐ నాయకులు

చక్రతీర్థ సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కంది, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంది మండల కేంద్రంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం చక్రతీర్థసేవతో ముగిశాయి. ఉదయం వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య బలిహరణ హోమం, పల్లకీసేవ, చక్రతీర్థ సేవ, నాగవెల్లి, సత్యనారాయణస్వామి కథ, డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తుల విగ్రహాలను పల్లకిలో ఊరేగించి ఆలయ ఆవరణలో ఉన్న కోనేటి తీర్థం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగారావు పంతులు, మధుసూదన్ రావు పంతులు, సురేష్ పంతులు, మాజీ వార్డుసభ్యుడు కుమ్మరి జంగయ్య, యాదగిరి, శ్రీను, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్

మెదక్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్థానిక రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతోపాటు కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా, రాష్ట్ర, వివిధ మోర్చాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఈసేవ కంప్యూటర్ ఆపరేటర్ మృతి

● స్వచ్ఛందంగా ఎంపీపీ కార్యాలయం బంద్



లక్ష్మణ్(ఫైల్)

చిన్నశంకరంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయ పంచాయతీ ఈసేవ కంప్యూటర్ ఆపరేటర్ ఎం.లక్ష్మణ్ బుధవారం మృతిచెందాడు. దీంతో ఎంపీపీ కార్యాలయాన్ని స్వచ్ఛందంగా బంద్ చేశారు. లక్ష్మణ్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. లక్ష్మణ్ మృతి పట్ల డీపీవో యాదయ్య, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ మాలతి, ఎంపీవో గిరిజారాణి, కార్యాలయ సిబ్బంది సంతాపం ప్రకటించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పలువురు రాజకీయ నాయకులు, జాతీయ మానవ హక్కుల సంఘం నాయకులు నివాళులర్పించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రేపటి నుంచి జాగృతి జనం బాట

మెదక్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో మెదక్‌లో జాగృతి జనం బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాగృతి బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య తెలిపారు. బుధవారం స్థానిక అర్అండ్‌బీలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనం బాట పోస్టర్‌ను ఆవిష్కరించి.. మాట్లాడారు. 15న జిల్లా కేంద్రంలోని వినాయక కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమానికి కవిత హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యావంతులు, మేధావులు, కులసంఘాలు తదితర వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.